క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పీసీపల్లి: మండల పరిధిలోని గుదేవారిపాలెంలో సోమవారం, మంగళవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం జరుగుతుందని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

55 మందికి వైద్య పరీక్షలు



టంగుటూరులో రోగులను పరీక్షిస్తున్న మాదాసి వెంకయ్య

టంగుటూరు: స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్య వైశ్య బజారులో నిర్వహించిన ఉచిత ప్రజా వైద్య కేంద్రంలో ఆదివారం పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. 55 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఆపరేషన్లు అవసరం అయితే ఉచితంగా చేయిస్తామని డాక్టర్ వెంకయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బొడ్డు శ్రీనివాసరావు, దుగ్గిరాల సునీల్, నత్తల హరిబాబు, బుర్రి చంద్ర, మద్దెల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా నివేదన పూజలు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహానివేదన పూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం సందర్భంగా ఆలయ పూజారులు నారాయణస్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించిఅభిషేకం, అర్చన, మహా నివేదన, గోపూజ, పల్లకీ సేవ చేపట్టారు. పూజల్లో భాగంగా భక్తులు పొంగళ్లు చేతబూని మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు భక్తులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ ప్రాథమిక రాత పరీక్ష



పరీక్ష కేంద్రానికి వెళ్తున్న అభ్యర్థులు

టంగుటూరు: మండలంలోని వల్లూరు గ్రామంలో రైజ్, ఫేస్ ఇంజినీరింగ్ కళాశాలల్లో కానిస్టేబుల్ ప్రాథమిక రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. రెండు కేంద్రాల్లో సుమారు 4 వేల మందికి పైగా అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఎస్పీ మలికా గర్గ్, ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ నాగరాజు పరిశీలించారు. కేంద్రాల వద్ద సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు ఎస్సై ఖాదర్‌బాషా, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు


టంగుటూరు: పిల్లలు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ జి.వర్ధనరాజు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కనిగిరి కానుంది సుందరగిరి



కనిగిరి దొరువు కొనేరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్(ఫైల్)

- రూ.2.66 కోట్లతో కనిగిరి దొరువు పునరుద్ధరణ
- ఎమ్మెల్యే బుర్రా కృషితో అమృత్ 2.0 ప్రాజెక్టులో నిధులు మంజూరు
- ఇప్పటికే దొరువును పరిశీలించిన ఏపీ గ్రీన్ కోర్ కమిటీ



కనిగిరి పట్టణ వ్యూ

కనిగిరి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అమృత్ 2.0 ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన పట్టణాల్లో ప్రణాళికలు రూపొందించి నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా జిల్లాకు రూ.494.7 కోట్లు మంజూరు కాగా కనిగిరి మున్సిపాలిటీకి రూ. 2.66 కోట్లు మంజూరయ్యాయి. సుమారు 51 వేల జనాభా ఉన్న కనిగిరి పట్టణానికి అమృత్ 2.0 ప్రాజెక్టు నిధులతో చేపట్టనున్న అభివృద్ధితో కొత్త శోభ రానుంది.

కనిగిరికి నూతన శోభ..

కాటం రాజు ఏలిన కనిగిరి పట్టణం ఇక సుందరం కానుంది. అమృత్ 2.0 పథకంలో భాగంగా కనిగిరి మున్సిపాలిటీలోని పట్టణ నడిబొడ్డున ఉన్న దొరువు అభివృద్ధికి రూ.2.66 కోట్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. కనిగిరి కాటంరాజు చరిత్రకు సాక్ష్యంగా ఆనవాళ్లు కల్గిన దొరువు ప్రాంతాన్ని అమృత్ ప్రాజెక్టు నిధులతో ఆహ్లాదకరమైన, సౌందర్యవంతమైన పర్యాటక కేంద్రంగా మార్చనున్నారు. రాజు కాలం నాటి దొరువు కొనేరుకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కృషితో కొత్త జీవం పోసుకోనుంది. దొరువు పునరుద్ధీకరణలో భాగంగా కొనేరులోని నీటిని శుద్ధి చేసి ఉపయోగించేలా చేయడమే కాక.. దొరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, మధ్యలో రోడ్లు, విద్యుదీకరణ, ఆహ్లాదకరమైన వాతావరణం కల్గించేందుకు పార్కు, ఇలా కొత్త హంగులు మరింత కనువిందు కలిగేలా నూతన సౌకర్యాలతో రూపుదిద్దనున్నారు. ప్రజలు కాసేపు సేద తీరేలా ప్రాచీన కాలం నాటి చరిత్రకు సాక్ష్యంగా ఉన్న కనిగిరి దొరువు ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతా



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కనిగిరి పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తా. పట్టణంలోని తాగు నీటి సమస్య పరిష్కారానికి (ఇంటింటికీ సాగర్ నల్లా) రూ.136 కోట్లతో సమగ్ర మంచి నీటి పథకం పనులు జరుగుతున్నాయి. రూ.15 కోట్ల ఎస్టీపీ నిధులతో పట్టణంలో మురుగునీటి పరిశుద్ధీకరణకు కేంద్ర నిధులు మంజూరయ్యాయి. అమృత్ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వం రూ.2.66 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కనిగిరి చరిత్రకు సాక్ష్యంగా ఉన్న దొరువు కొనేరును సుందరంగా తీర్చిదిద్దుతాం.

బుర్రా మధుసూదన్ యాదవ్, ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు

ఎమ్మెల్యే కృషితోనే అభివృద్ధి



కనిగిరి దొరువు ప్రాంత అభివృద్ధికి నిధుల మంజూరు ఎమ్మెల్యే కృషి ఫలితమే. ఎమ్మెల్యే సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తా. దొరువును సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్ది ఆహ్లాదకరంగా రూపుదిద్దుతాం. పట్టణంలో 15వ ఆర్థిక సంఘ నిధులు సుమారు రూ. 4 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే గ్రీన్ డ్యూటిఫికేషన్ కార్పొరేషన్ కమిటీ దొరువును పరిశీలించారు

– ఎస్‌కే అబ్దుల్ గఫార్, మున్సిపాలిటీ చైర్మన్

త్వరలో పనులకు శ్రీకారం



లక్ష లోపు జనాభా ఉన్న మున్సిపాలిటీలను అమృత్ 2.0 ప్రాజెక్టులో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. కనిగిరిలోని దొరువు ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్ కమిటీ దొరువును పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. నిధులు మంజూరయ్యాయి. అందులో యుఎల్బీ (పట్టణ స్థానిక సంస్థ) వాటా కింద మున్సిపాలిటీ నుంచి రూ.25 లక్షలు చెల్లించాలి. త్వరలో పనులు ప్రారంభం కానునయ్యాయి.

– డీవీఎస్ నారాయణరావు, కమిషనర్

సీఎంకు కృతజ్ఞతలు

కందుకూరు అర్బన్: కృష్ణ బలిజ, పూసల, సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టర్ పదవిని రెండేళ్ల పాటు పొడిగించినందుకు కందుకూరుకు చెందిన పాశం కుమారి, భర్త కొండయ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, బీసీ మంత్రి చెల్లు బోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కల్యాణోత్సవం

వలేటివారిపాలెం: భ్రమరాంబిక మల్లికార్జున స్వామి నాలుగో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయంలో కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రకాంత్‌శర్మ తెలిపారు. ఊరికి పరమట వెలసిన శివాలయంలో సోమవారం ఉదయం స్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఊరేగింపు ఉంటుందన్నారు.

మహేంద్రారెడ్డి భౌతికకాయానికి నివాళి



మహేంద్ర భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నేతలు

కనిగిరి రూరల్: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రమౌళి కుమారుడు మహేంద్రారెడ్డి(25) భౌతిక కాయాన్ని ఆదివారం స్వగ్రామమైన చింతలపాలెం తీసుకొచ్చారు. మహేంద్రారెడ్డి భౌతికకాయాన్ని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ సందర్శించి నివాళులర్పించారు. చంద్రమౌళి కుటుంబాన్ని ఓదార్చారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నివాళులర్పించిన వారిలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు పెన్నా నాగమ్మ, రామనబోయిన ప్రశాంతి, నక్కా ఉమాదేవి, దేవరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఎంపీపీ ప్రకాశం, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, రామనబోయిన శ్రీను, రామకృష్ణా, పెన్నా ఏడుకొండలు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై టిప్పర్ బోల్తా



రన్ వేపై చెల్లాచెదురుగా పడిన గ్రానైట్ రాళ్లు

సింగరాయకొండ: మండల పరిధిలో కనుమళ్ల జంక్షన్ సమీపంలో విమానాల రన్ వేపై గ్రానైట్ రాళ్ల లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ బోల్తా పడిన ఘటన ఆదివారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో చోటుచేసుకుంది. హైవే పెట్రోలింగ్ పోలీసుల కథనం ప్రకారం.. చీమకుర్తి నుంచి రామాయపట్నం పోర్టుకు గ్రానైట్ రాళ్ల లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ నిద్రమత్తులో హైవే మధ్యలో సిమెంట్ దిమ్మెను బలంగా ఢీకొట్టాడు. దీంతో టిప్పర్ అదుపుతప్పి ఒంగోలు వైపు వెళ్లే మార్గంలో బోల్తా పడింది. గ్రానైట్ రాళ్లు రన్‌వేపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఆ సమయంలో ట్రాఫిక్ తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద ఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన హైవే పెట్రోలింగ్ పోలీసులు సమాచారాన్ని ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమాకు తెలిపారు. ఎస్సై సూచన మేరకు కానిస్టేబుళ్లు శశిధర్‌రెడ్డి, మురళి భారీ క్రేన్, జేసీబీ తీసుకువచ్చి ఉదయం ఆరు గంటల వరకు శ్రమించి రన్‌వే పద్ద గ్రానైట్ రాళ్లు, టిప్పర్‌ను తొలగించారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు, సర్పంచ్

హనుమంతునిపాడు: సంక్రాంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని దొడ్డిచింతలలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో మొదటి స్థానంలో దొడ్డిచింతల ఏ గ్రూపు టీం, ద్వితీయస్థానంలో వెలిగండ్ల మండలం కంకణంపాడు యూత్‌ఫోర్సు, తృతీయ స్థానంలో దొడ్డిచింతల బీ టీంలు నిలిచాయి. విజేతలకు రూ.20,116, రూ.15,116, రూ.10,116 అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి,విశ్రాంతి ఉపాధ్యాయులు ఎస్ నారాయణరెడ్డి, కోటపాటి మనోహర్‌రెడ్డి, కోటపాటి రమేష్, నారాయణ, మాజీ సర్పంచ్ నాగూర్, నాగరాజు పాల్గొన్నారు.

నేడు వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



అగ్నిగుండాన్ని వెలిగిస్తున్న ఆలయ చైర్మన్ బాలకొండలు

పామూరు: మాఘశుద్ధ విదియ వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సోమవారం ఆలయం వద్ద నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు తెలిపారు. ఉదయం సామూహిక కుంకుమార్చన, సాయంత్రం పల్లకి ఊరేగింపు, అనంతరం అగ్నిగుండ ప్రవేశం ఉంటుందన్నారు. ఆర్యవైశ్యులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ చైర్మన్ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం అగ్నిగుండాన్ని ప్రారంభించారు.

భైరవకోనలో ప్రత్యేక పూజలు



భైరవకోనలో పూజలు చేస్తున్న కర్నూలు జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఆదివారం పూజలు చేశారు. మిత్ర బృందంతో కలిసి ఆదివారం భైరవకోనకు వచ్చిన ఆయన అక్కడి జలపాతాన్ని సందర్శించి త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ పూజారులు కంబాలదిన్నె వెంకటనర్సయ్య, పంచాగ్నుల రామమూర్తి శర్మ, సుధాకర్‌శర్మలు జెడ్పీ చైర్మన్‌కు స్వాగతం పలికి పూజలు చేశారు.